
# హెచ్‌ఎండీఏకు ఏమైంది?

## ఏడాది కాలంగా ఒక్క ప్రాజెక్టూ పట్టాలెక్కలే..

- అధికారులు మారినా.. ఆచరణలోకి రాని అభివృద్ధి ప్రణాళికలు..
- కనీసం పెండింగ్ ప్రాజెక్టులనూ పూర్తి చేయలేని వైనం



సిటీబ్యూరో, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ పనితీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా... ఏ ఒక్క ఐకానిక్ ప్రాజెక్టునూ పట్టాలెక్కించలేకపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్రను పోషించే హెచ్‌ఎండీఏ.. ఆ దిశగా ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా డిజైన్ చేయలేదు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత మార్చిలో రెండు ఎలివేటెడ్ కారిడార్లకు శంకుస్థాపన చేసింది. కానీ, ఇందులో ఏ పురోగతీ లేదు. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్‌ఎండీఏ.. మౌలిక వసతులను కల్పించాల్సి ఉన్నా... ప్రాజెక్టులను మొదలుపెట్టడంలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి ఏడాదిలో హెచ్‌ఎండీఏ పాత్ర శూన్యంగా మారింది.

### అభివృద్ధి ప్రాజెక్టులు పక్కన పెట్టేసి..

హెచ్‌ఎండీఏలో అభివృద్ధి ప్రాజెక్టులకు పక్కన పెట్టేశారు. గతంలో మాదిరి మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేసిన హెచ్‌ఎండీఏ అధికారులు... ప్రస్తుతం పెండింగ్ పనులపై దృష్టి పెట్టడం లేదు. చేతిలో భారీ ప్రాజెక్టులు ఉన్నా... నివేదికలు, అధ్యయనాలతో సరి పెడుతూ పనులు మొదలుపెట్టడమే లేదు. ఇక అర్ధాంతరంగా నిలిచిన ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏడాది ఆరంభంలోనే అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ ఇప్పటికీ నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. గతంలో ప్రతిపాదించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కూడా పట్టాలెక్కించడంలో కాలయాపన చేస్తున్నారు. దీంతో మెట్రోపాలిటన్ నగరంలో అభివృద్ధి కుంటుపడుతున్నది.

### అన్నీ పెండింగ్‌లోనే...

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా... ప్రాజెక్టుల్లో పురోగతి లేకుండా పోయింది. కోట్లు వెచ్చించి గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేసేలా ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదు. కనీసం ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. హైదరాబాద్ టూరిజానికే తలమానికంగా నిలువనున్న కొత్వాల్‌గూడ్ ఎకో పార్క్ నిర్మాణంపై హెచ్‌ఎండీఏలో నిర్లక్ష్యం ఆవహించింది. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి పనులు కొన సాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టిపెట్టకపోవడంతో ప్రాజెక్టులకు తుది రూపం రావడం లేదు. ఇక పెండింగ్‌లోనే పలు అభివృద్ధి పనులు ఉండగా.... కొత్తగా ప్రతిపాదించిన రెండు ఎలివేటెడ్ కారిడార్లు, మీరాలం కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులు కూడా కాగితాలకే పరిమితమైంది. వీటి డిజైన్లు అన్నీ సిద్ధంగానే ఉన్నప్పటికీ... ప్రాజెక్టులపై కన్సల్టెన్సీలను నియమించి అధ్యయనం పేరిట కాలయాపన చేస్తున్నది.



పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆకాశమంతా మేఘావృతమై మంచుతో కప్పేసుకున్నది. ఉదయం నుంచి చల్లటి గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు శీతాకాలం కావడంతో జిల్లా వాసులను చలి వణికించింది.ఉదయమే పనుల నిమిత్తం వెళ్లేందుకు కూలీలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు జంకారు. చలి తీవ్రతతో కొందరైతే తెల్లవారినా దుప్పట్లను విడువలేదు.

**రంగారెడ్డి (నమస్తేతెలంగాణ) డిసెంబర్ 25**



# ఆధ్యాత్మిక కేంద్రంగా కన్హాశాంతి వనం

- భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్
- కుటుంబంతో కలిసి కన్హా సందర్శన



కన్హాలో ధ్యాన గురువు కమలేశ్ పటేల్ తో మాట్లాడుతున్న భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్

నందిగామ, డిసెంబర్ 25 : కన్హా శాంతి వనం దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యావరణానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నదని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు. బుధవారం సాయత్రం భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ సతీమణితో కలిసి రంగారెడ్డి జిల్లాలోని నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనాన్ని సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి కన్హాలో కొద్దిసేపు ధ్యానం చేశారు. అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా ధ్యాన గురువు కమలేశ్ పటేల్ చేస్తున్న అనేక కార్యక్రమాలను అభినందించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కన్హాలో ఏర్పాటు చేసిన గ్రీనరీతో ఆహ్లాదకరమైన గొప్ప వాతావరణం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

# అమిత్ షా క్షమాపణలు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజూగౌడ్

తాండూరు, డిసెంబర్ 25 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజూగౌడ్ అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్‌కు సముచిత స్థానం ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో బీ ఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా, దేశ ప్రజల మనో భావాలను దెబ్బతీసేలా అమిత్ షా చేసిన వాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ప్రపంచానికే ఓ ఐకాన్‌గా నిలిచిన అంబేద్కర్‌ను అవమానకర రీతిలో మాట్లాడం సిగ్గుచేటన్నారు. దయ్యాలు వేదాలను వల్లించినట్లు కాంగ్రెస్ నేడు అంబేద్కర్ గురించి మాట్లాడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ దేశంలో అధికారంలో ఉన్న సమయంలో భారతరత్న ఎందుకు ఇవ్వలేదన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదన్నారు. అంబేద్కర్‌పై ప్రధాని నరేంద్ర మోదీకి ఏమాత్రం గౌరవమున్నా అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. అంబేద్కర్‌పై అమిత్ షా వాఖ్యలు గర్హనీయమన్నారు.

# పత్రీజీ ఆశయాలను కొనసాగించాలి

- మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- ధ్యాన మహాయాగంలో పాల్గొన్న ఆధ్యాత్మిక గురువులు



ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 25 : ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ ఆశయాలను ప్రతి ధ్యాని కొనసాగించాలని, ధ్యాన జగత్ కల సాకారం చేసేందుకు ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు ఐకమత్యంతో ముందుకు సాగాలని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 మహా సభలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్‌కింగీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రాతఃకాల సంగీత ధ్యానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మనలోని సంకల్పానికి ధ్యానం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. అనంతరం సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్‌తో కలిసి ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాస్టర్లు ఆధ్యాత్మిక సందేశాలను, ధ్యాన అనుభవాలను వివరించారు. సాయంత్రం శివశ్రీ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన పార్వతీపరమేశ్వరుల, గోవిందా కల్యాణం ప్రదర్శనలు, నృసింహస్వామి ప్రదర్శన ధ్యానులను విశేషంగా ఆకట్టుకున్నది. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, శివప్రసాద్, రాజేశ్, రాంబాబు, శ్రీరాంగోపాల్, హనుమంతురాజు, బాలకృష్ణ, నిర్మల, హనుమంతురావు, చంద్రశేఖర్, నర్సింహ, హనుమంతురాజు, మధుమోహన్, దామోదర్‌రెడ్డి, నిర్మల, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృసింహస్వామి నృత్య ప్రదర్శన

# దేశానికి దిక్సూచి..వాజ్‌పేయి



కాటేదాన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో నివాళులర్పిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 25: దేశాభివృద్ధికి బాటలు పరిచి, ప్రపంచానికి భారత్ శక్తిని చూపిన మహనీయుడు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తోకల శ్రీనివాస్‌రెడ్డి అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, వెంకటరమణగుప్తా, నవారు మురళీధర్‌రెడ్డి, తలారి చిన్న, ఎన్.జగన్, వల్లూరి శ్రీనివాస్, ఎల్.వి.రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, మోహన్, అనిల్‌రెడ్డి, నందు, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### హైదర్‌గూడలో...

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పొన్నమోనీ మల్లేశ్‌యాదవ్, నల్లింగ్ రమేశ్, రాచూరి రాజశేఖర్, జయానంద్‌రెడ్డి, కృష్ణ, హరినాథ్, జగన్, శంకర్, ముత్యంరెడ్డి, శ్రీశైలం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడ చౌరస్తాలో అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

### శంషాబాద్ పట్టణంలో ..

శంషాబాద్ రూరల్: భారత మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహార్ వాజ్‌పేయి జయంతిని శంషాబాద్ పట్టణంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్ ఆధ్వర్యంలో దవాఖానలో రోగులకు పండ్లు ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మహనీయుడిగా కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌రాజ్, ప్రశాంత్, రమేశ్, శ్రీను, శ్రావణ్, గోపి, యాదగిరి, సాయి తదితరలు పాల్గొన్నారు.

## అధునాతన ఫీచర్లతో..

# మెట్రో యాప్

**మెట్రో కార్డు ఇబ్బందులపై కదలిన యంత్రాంగం**

**ఫిజికల్ కార్డు లేకున్నా.. యాప్ ద్వారా యాక్సెస్ చేసేలా డిజైన్**



సిటీబ్యూరో, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు హైదరాబాద్ మెట్రో కోసం ప్రత్యేక యాప్‌ను డిజైన్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇన్నాళ్లు మెట్రో కార్డు ద్వారా రాయితీలతో కూడిన రవాణా సౌకర్యం కల్పించగా... ఫిజికల్ కార్డు వెంట పెట్టుకుని తిరగాల్సి వచ్చేది. ఒకవేళ కార్డు డ్యామేజీ జరిగినా.. మరిచిపోయినా కచ్చితంగా టికెట్ కొనాల్సిన పరిస్థితి ఉండేది. ఇలాంటి ఇబ్బందుల నేపథ్యంలోనే ఫిజికల్ కార్డుతో పనిలేకుండా, మరింత సులభంగా మెట్రో యాక్సెస్ చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కొంతకాలంగా వినియోగదారులు కోరుతున్నారు. ఈ మేరకు మెట్రో టెక్నికల్ విభాగం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ప్రస్తుతం ఢిల్లీ మెట్రో తరహాలో యాప్ బేస్డ్ విధానం అమల్లో ఉండగా... అదే తరహాలో ప్రస్తుతం ఉన్న టీ సవారీ యాప్ కంటే అధునాతన ఫీచర్లను జోడించనున్నారు. ఈ క్రమంలో కార్డుతో సంబంధం లేకుండా నేరుగా రాకపోకలు చేసుకునేలా తీర్చిదిద్దనున్నారు. ఏటీఎం కార్డు లేకున్నా... మొబైల్ యాప్‌లోని డబ్బు చెల్లింపులు జరుగుతున్నట్లుగానే అదే విధానాన్ని మెట్రో మొబైల్ యాప్‌లోనూ వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా కార్డు రీచార్జ్ కూడా సులభంగా చేసుకునేలా ఫీచర్లతో కొత్త మెట్రో మొబైల్ యాప్ ఉంటుందని, దీనికి సంబంధించిన అధ్యయనం పూర్తి అయినట్లు తెలిసింది.

### ఫిబ్రవరి లేదా మార్చి..

వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రయత్నిస్తున్నది. ప్రస్తుతం ఢిల్లీ మెట్రో రూపొందించిన యాప్ డిజైన్లతో పాటు, ఇతర యాప్‌లను అధ్యయనం చేసిన నగర మెట్రో వాసులకు అధునాతన సేవలను అందించనున్నారు. హైదరాబాద్ మెట్రోకు క్రమంగా ఆదరణ పెరుగుతున్నది. నిత్యం 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

**సంధ్య థియేటర్ ఘటనపై..**

# తప్పుడు పోస్టులు పెట్టొద్దు

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఇటీవల సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టినా లేక ప్రజలను అపోహలకు గురిచేసే విధంగా కామెంట్లు చేసినా కఠిన చర్యలు తప్పవని నగర పోలీసులు హెచ్చరించారు. అల్లు అర్జున్ రాకముందే థియేటర్‌లో తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలను పోస్టు చేయడం తాము గుర్తించామని, జరిగిన ఘటనపై వాస్తవాలకు సంబంధించిన వీడియోలను ఇప్పటికే పోలీసు శాఖ ప్రజల ముందు ఉంచినప్పటికీ కొందరు పనిగట్టుకుని ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు ప్రచారం చేసే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అప్పులు తెచ్చి అభివృద్ధి చేశాం..

# పెండింగ్ బిల్లులు చెల్లించండి మహాప్రభో..!

- ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన అభివృద్ధి పనుల బిల్లులు
- ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు




అన్నోజిగూడ గ్రామ పంచాయ కార్యాలయం

కందుకూరు, డిసెంబర్ 25 : పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు పోరుబాట పట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రొసిడింగ్‌లు ఇచ్చి నిధులను కూడా కేటాయించింది. దీంతో అప్పటి సర్పంచ్‌లు పల్లెల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర పనులను చేపట్టారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం నిధుల విడుదలను పూర్తిగా నిలిపివేసింది. గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నా ఎలాంటి చెల్లింపులు చేయవద్దని ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేసింది. తాము చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వాలని మాజీ సర్పంచ్‌లు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పహ మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ వారి గోడు ఎవరికీ పట్టడం లేదు. అప్పులు చేసి, బంగారాన్ని తనఖా పెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేకుంటే తాము తామంతా రోడ్డున పడుతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాను..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పనులకు ప్రొసీడింగ్‌లు అందాయి. ప్రభుత్వం అందజేసిన ప్రొసీడింగ్‌లతో అభివృద్ధి పనులు చేపట్టాను. మాది గిరిజన తండా చిన్న గ్రామపంచాయతీ. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాను. ఇప్పటికైనా ప్రభుత్వ నేతలు స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించి ఆదుకోవాలి.

**రజితాప్రవీణ్‌నాయక్, సార్లపల్లి, మాజీ సర్పంచ్**

### ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాను. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో తెలిసిన వ్యక్తుల వద్ద, బంగారాన్ని బ్యాంకులో తనఖా పెట్టి డబ్బులు తీసుకువచ్చా. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతోపాటు ప్రతిపక్ష నాయకులకు వినతిపత్రాలు అందజేశాం. అయినా ఫలితం కనిపించడంలేదు. ఆందోళనకు దిగితే అరెస్టులు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం అప్పులు నిధులు వెచ్చించాం. అప్పటికప్పుడు నిధులు అవసరం కావడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి.

**సాద మల్లారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ కార్యదర్శి.**